క్లుప్తంగా

'మావోయిస్టులు ప్రగతి విరోధకులు'

కరకగూడెం: మావోయిస్టులు ప్రగతి విరోధకులని, వారివి కాలం చెల్లిన సిద్ధాంతాలని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని కొత్తూరు, చొప్పాల వలస ఆదివాసీ గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రజలు మావోయిస్టులకు ఎట్టి పరిస్థితిలో సహకరించొద్దని సూచించారు. అనంతరం చిన్నపిల్లలకు పలకలు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై పీవీఎన్ రావు, స్పెషల్ పార్టీ టీజీఎస్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలే కీలకం



ఇరవెండి ఫారెస్ట్ బీట్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ తదితరులు

బూర్గంపాడు: పర్యావరణ పరిరక్షణలో మొక్కలే కీలకమని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ అన్నారు. గురువారం సండెల్లరామాపురంలోని ఫారెస్ట్ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఇరవెండి, సారపాక ఫారెస్ట్ బీట్‌లలో గతంలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ సంరక్షణలో ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలన్నారు. అటవీ సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, డీఆర్‌ఓ సుజాత, ఎఫ్‌బీఓ భీంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ స్క్రీనింగ్ క్యాంప్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని నామవరం, కంపగూడెం, భాస్కరాపురం గ్రామాల్లోని గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో గురువారం సికిల్‌సెల్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఎర్రగుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు సికిల్‌సెల్ వ్యాధి పరీక్షలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి జ్వర పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక, ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, హెచ్ఎస్ ప్రకాష్‌రావు, హెల్త్ అసిసెంట్ కోటేశ్వరరావు, సిబ్బంది లావణ్య, నాగజ్యోతి, ఆశ కార్యకర్తలు నాగమ్మ, శిరోమణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కరకగూడెం: మండల పరిధిలోని చొప్పాల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నవీన్- వరలక్ష్మి దంపతుల ఐదు సంవత్సరాల కుమారుడు వరుణ్ తేజ్ హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల ఇబ్బంది పడుతున్నారనే విషయం తెలుసుకొని మణుగూరుకు చెందిన జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యుడు వాసిరెడ్డి పవన్ కుమార్ ఆర్థిక సాయం అందించారు. గురువారం సదరు ఆస్పత్రికి వెళ్లి ఆ కుటుంబానికి వైద్య ఖర్చులకు రూ.15 వేలు అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటకాలు చేసే కార్మికుల సమస్యలను సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో గురువారం మధ్యాహ్నం కార్మికులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్మికురాలికి నెలకు రూ.20 వేతన ఇవ్వాలని, బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల నాయకుడు జంగిలి వెంకటరత్నం, సంఘం నాయకురాళ్లు సీత, రమణ, సులోచన, బుచ్చమ్మ, పద్మ పాల్గొన్నారు.

మృతికి కారకులను శిక్షించాలి

మణుగూరురూరల్: ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రిలో వైద్యచికిత్సలు పొందుతూ మరణించిన పూనెం సుప్రీత్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు దండుకుని మోసం చేసి ఓ యువకుడు మరణానికి కారణమైన మురళి మ్యాన్ పవర్ సెక్యూరిటీ విభాగం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

7న ఆవిర్భావ వేడుకలు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 7వ తేదీన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి కోరారు. గురువారం మండలంలోని గ్రామంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో జెండా దిమ్మె నిర్మాణానికి భూమి పూజ చేశారు. జిల్లా కార్యదర్శి ఫకీరయ్య, అశోక్, నాగ మహేశ్వరరావు, వేల్పుల సుదర్శన్, ప్రసాద్, ఏసు, శేఖర్ పాల్గొన్నారు.

రహదారులకు గ్రహణం వీడేదెన్నడు?

- రోడ్ల నిర్మాణానికి కలగని మోక్షం
- నిధులున్నా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రేగళ్ల-మర్కోడ్ గుట్టపై నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు



గుట్టపై ఆటోను తోస్తున్న ప్రయాణికులు

కరకగూడెం: అటవీ పల్లెల్లో రహదారుల నిర్మాణానికి గ్రహణం వీడడం లేదు. నిధులు మంజూరైనా అనుమతులు రాక పనులు ప్రారంభం కావడం లేదు. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలు, నిత్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
కరకగూడెం మండలంలోని రేగళ్ల, మర్కోడ్, చిరుమళ్లదోమేడ గ్రామాల్లో నివసించే ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా, అభివృద్ధి పథకాలు వస్తున్నా ఈ గ్రామాలకు మాత్రం సరైన రోడ్డు సౌకర్యం కలగానే మిగిలిపోయింది.

అక్కరకు రాని నిధులు

రేగళ్ల అటవీ ప్రాంతం మీదుగా మర్కోడ్ గ్రామానికి, చిరుమళ్ల నుంచి దోమేడ గ్రామాల మధ్య ఉన్న రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఈ రూట్లలో రహదారుల నిర్మాణానికి నక్సల్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధులు (ఎల్‌డబ్ల్యూఈ) నిధులు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. కానీ అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చిరుమళ్ల జాతరకు వచ్చిన మంత్రి సీతక్క.. పనులు సాగేందుకు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

అవస్థలు అనంతం

వర్షాకాలంలో ఈ రోడ్లు బురదమయంగా మారి ప్రయాణానికి పూర్తిగా అవరోధాలుగా మారుతున్నారు. వాహనాలు కూరుకుపోవడం, పాదచారులు సైతం నడవడానికి ఇబ్బంది పడటం ఇక్కడ నిత్యకృత్యం. ఈ క్రమంలో కాన్పు నొప్పులతో అల్లాడుతున్న గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లలేక గిరిజన పల్లెల్లోఎంతో మంది తల్లులు ప్రాణాలు అరచేతితో పట్టుకుంటున్నారు. విషపురుగు కాటుతోనో, జ్వరంతోనో అపస్మారక స్థితిలోకి వెళ్లిన పిల్లలను ఆస్పత్రికి చేర్చలేక ఎందరో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పంట పండినా, దాన్ని మార్కెట్‌కు తరలించలేక, స్థానికంగా గిట్టుబాటు ధర లేక అప్పులపాలైన రైతుల ఆక్రందనలు అరణ్య రోదనే అవుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక, ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు చేరుకోలేక నిత్యం అవస్థలు పడుతున్నారు.

అనుమతుల పేరుతో చెలగాటం



చిన్నపిల్లలకు జ్వరం వచ్చినా, కాన్పు నొప్పులతో ఉన్న గర్భిణులను ఆస్పత్రికి వెళ్లాలన్నా మేము రేగళ్ల మీదుగా కరకగూడెం వెళ్లాలి. రాత్రిపూట ఎవరైనా జబ్బు పడితే ఆసుపత్రికి తీసుకెళ్లడం నరక ప్రాయంగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందంటారు. కానీ ఎక్కడ పనులు జరుగుతున్నాయి? ఈ అనుమతుల పేరుతో మా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మా కష్టాలు తీరుతాయో తెలియడం లేదు.

– జోగ నర్సింహారావు, మర్కోడ్

నిర్లక్ష్యానికి నిదర్శనం..



సరైన రోడ్లు లేక గ్రామీణులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అటవీ శాఖ అనుమతులు రాలేదనే సాకుతో పనులు నిలిచిపోయాయి. ఇది అధికారుల నిర్లక్ష్యానికి, ప్రభుత్వాల సమన్వయ లోపానికి నిదర్శనం. ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అటవీ శాఖ, రోడ్లు భవనాల శాఖల మధ్య సమన్వయం ఏర్పరిచి వెంటనే అనుమతులు మంజూరు చేయించాలి.

– కొమరం కాంతారావు, సీపీఎం మండల కార్యదర్శి

మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో 100 పడకల ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సునీల్‌తో కలిసి అన్ని వార్డులు కలియదిరిగారు. వైద్యం పొందుతున్న ఇన్‌పేషంట్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలని వైద్యులకు సూచించారు. మండలాలు, గ్రామాలు దాటి ఇక్కడకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణపై సమీక్ష

గురుకుల హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పక అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో నియోజకవర్గ సంక్షేమ, గురుకుల హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానకాలం నేపథ్యంలో శానిటేషన్ మెరుగుపరుచుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏఎన్‌ఎంలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. హాస్టల్ సమస్యలు ఏమున్నా వార్డెన్ తనను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ అశోక్, ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు, హాస్టళ్ల ఇన్‌చార్జ్‌లు, వార్డెన్‌లు పాల్గొన్నారు.

క్లినిక్‌ల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య భద్రాచలం పట్టణంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాక్షిలో గత నెల 26న నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎంపీలు మోతాదుకు మించి స్టెరాయిడ్లు, యాంటీబయోటిక్స్ వాడకూడదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించిన ఆర్‌ఎంపీలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీ..

మెనూ పాటించాలి

పినపాక: మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అందించాలని జానంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని జానంపేట కాంప్లెక్స్ పరిధిలో గల ప్రాథమిక పాఠశాల కొత్త గుంపు, ప్రాథమిక పాఠశాల దుబ్బగుడంను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు . ఫ్రీ టెస్ట్ బుక్స్ యూనిఫాం అందించినది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల చేత విత్తనాలను సేకరించాలని, ఆ విత్తనాలను విద్యార్థుల చేతనే నాటించి పెంచేలా ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్శనలో కాంప్లెక్స్ సీఆర్పీ ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరవ్వాలి

అశ్వాపురం: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే పాల్గొననున్నట్లు వెల్లడించారు.

అర్ధనగ్న ప్రదర్శన

దమ్మపేట: దమ్మపేట బస్‌స్టేషన్ లోనికి బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉన్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతూ.. కొందరు స్థానిక యువకులు గురువారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. దమ్మపేట బస్ స్టేషన్ ముందర చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కార్యక్రమం నాలుగో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరంలో స్థానికులు మోకాళ్లపై అర్ధనగ్నంగా కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం రహదారిపై నిలబడి, కాసేపు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సున్నం శ్రీను, తంబళ్ల రవి, కోలికపోగు కాంతారావు, వలీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మండల మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనియన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. మోటార్ కార్మికులు పనిచేసుకోవడానికి అనువుగా ఆటోనగర్ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్, లోకేష్, కడార్ల చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖకు సహకారం అందిస్తాం



కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకరరావు

అశ్వారావుపేటరూరల్: వానా కాలం సీజన్ నేపథ్యంలో కార్యదర్శులు పారిశుద్ధ్యంపై, వైద్య ఆరోగ్య శాఖ సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీఓ ప్రభాకరరావు సూచించారు. గురువారం ఆయన మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, పాత రెడ్డిగూడెం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే జీపీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినాయకపురం గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. జ్వరాలు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న రోగుల గురించి వివరాలు అడిగారు. రెండు శాఖల మధ్య సమన్వయం ఉండాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

మణుగూరుటౌన్: 100 పడకల ఆస్పత్రిలో కింగ్ డోమ్స్ కల్చర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఎస్‌కె.అంజుమనార భేగం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, ఆర్ఎంఓ సాయి మోహన్, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ సైదులు, యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, గోరంట్ల కనకయ్య, కూచిపూడిబాబు, సుబ్బారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: సమితిసింగారం పంచాయతీ సాయినగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మణుగూరు పట్టణంలోని మండలపు మల్లికార్జున్‌రావు–జ్యోతి దంపతులు, కుటుంబ సభ్యులు సాయి తరుణ్, అనసూర్యలు అన్నదానం ఏర్పాటు చేశారు.

మినుము విత్తనాలు అందజేత

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం రైతువేదికలో రైతులకు మణుగూరు వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు, ఏఓ రాహుల్‌రెడ్డి మినుము విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మిర్చి పంట సాగు చేయదలచిన రైతులు ముందుగా పొలంలో మినుము విత్తనాలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని అన్నారు. ఈ మేరకు రైతులు గుట్టమల్లారం రైతు వేదికలో మినుము విత్తనాలను ఉచితంగా పొందవచ్చని వారు తెలిపారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సమ్మెపై అఖిలపక్ష సమావేశం



ములకలపల్లి: ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ వర్కర్లు

మణుగూరుటౌన్: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ (ఏఐటీయూసీ), వెలగపల్లి జాన్(ఐఎన్‌టీయూసీ), ఆర్. మధుసూదన్‌రెడ్డి(టీయూసీఐ)లు పాల్గొని మాట్లాడారు. లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవడం, కనీస వేతనం 26వేలు చెల్లించడం, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాయలక్ష్మం, కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఐతనబోయిన సతీష్, శ్రీనివాస్, సీతారాములు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నోటీస్ అందజేత

ములకలపల్లి: ఈనెల 9వ తేదీన జరుప తలపెట్టిన గ్రామీణ భారత బంద్‌కు సంబంధించి తెలంగాణా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్ష, కార్యదర్శులు చిక్కుల శ్రీను, గంటా శ్రీనివాసరావులు గురువారం ఎంపీడీఓ సత్యనారాయణకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నోటీస్ అందజేసిన వారిలో వర్కా రుక్మాంగధర రావు, సాయిరత్న, కొక్కెరగడ్డ సతీష్, కనకం చిన్నయ్య తదితరులు ఉన్నారు.

నారాయణపురంలో బోనాల వేడుకలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆషాడ మాసం సందర్భంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు బోనాలను తలపై పెట్టుకుని మేళతాళాలతో ప్రదర్శనగా గ్రామ శివారులో ఉన్న కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రదీక్షణలు చేసి బోనాలను సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో గ్రామంలో, ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.



బోనాలతో ఆలయానికి వచ్చిన మహిళలు

నిర్లక్ష్యానికి రెండేళ్లు..

- నాడే పంచాయతీ భవనాలకు నిధులు
- నేటికీ సగం కూడా పూర్తికాని వైనం
- కాంట్రాక్టర్లు, అధికారుల తీరుపై విమర్శలు



రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు మొదలైనా అసంపూర్తిగానే ఉన్న కుదునూరు పంచాయతీ భవనం

చర్ల: గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు నిధులున్నా నిష్ప్రయోజనంగా తయారయ్యాయి. కార్యాలయ భవనాల నిర్మాణాల కోసం రెండున్నరేళ్ల క్రితం నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండడం, అధికారులు మౌనం దాల్చుతుండడంతో కార్యాలయ భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

18 పంచాయతీ భవనాలకు నిధులు

చర్ల మండలంలో గతంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైన అనంతరం పరిపాలనా సౌలభ్యం కోసం 26 గ్రామ పంచాయతీలుగా విడిపోయాయి. 14 పాత పంచాయతీలకు సంబంధించి మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోగా.. పూర్తిగా శిథిలమైన 6 గ్రామ పంచాయితీలతో పాటు కొత్తగా రూపాంతరం చెందిన 12 గ్రామ పంచాయతీలకు కలిపి మొత్తం 18 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ 20 లక్షల చొప్పున మొత్తం 18 భవనాల నిర్మాణాలకు రూ 3.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే అప్పట్లో ఆయా గ్రామ పంచాయతీలలో ఉన్న పాలక వర్గాలు వాటి నిర్మాణాలకు వారికి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.


రెండేళ్లలో పూర్తయింది నాలుగే..

గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం.. పనులు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించడంతో స్థలం కొరత ఉన్న నాలుగు గ్రామ పంచాయతీలు మినహా మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాలను హడావిడిగా ప్రారంభించారు. రెండేళ్లుగా సాగిని ఈ నిర్మాణాల్లో ఇప్పటి వరకు పూర్తయింది కేవలం సుబ్బంపేట, లక్ష్మీకాలనీ, చినమిడిసిలేరు, లింగాపురం గ్రామ పంచాలు మాత్రమే. మిగిలిన వాటిలో మరో 5 భవనాల నిర్మాణాలు చివరి దశకు చేరాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటుండగా, మిగిలిన వాటిలో పురోగతి లేదు. కుదునూరు, పులిగుండాల, పూసుగుప్ప తదితర గ్రామాల్లో చేపట్టిన భవనాల నిర్మాణాలు అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నత్తనడకన సాగుతున్నాయి.

ఇంకా స్థలమే సేకరించలే..

రెండున్నరేళ్ల క్రితం 18 గ్రామ పంచాయతీ నూతన భవనాలకు నిర్మాణాలకు నిధులు మంజూరవ్వగా.. వాటిల్లో నాలుగు గ్రామ పంచాయితీలకు ఇంకా స్థల సేకరణే జరుగలేదు. తిప్పాపురం, కుర్నపల్లి, కొత్తపల్లి, బోదనెల్లి గ్రామ పంచాయితీలకు సంబంధించి నేటికీ స్థల సేకరణ చేపట్టలేదు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల్లో నూతన భవన నిర్మాణాలను పూర్తి స్థాయిలో వెనుకడి ఉన్నాయి.


వైద్య ఆరోగ్యశాఖ భవనంలోనే..



గ్రామపంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నాం. భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ స్థలం లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేదు. రెవెన్యూ అధికారులు పలుమార్లు స్థల సేకరణకు వచ్చినప్పటికీ సరైన స్థలం దొరుక లేదు.

– దయాకర్, పంచాయతీ కార్యదర్శి, బోదనెల్లి


కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం..



18 కార్యాలయ భవనాలకు సంబంధించి 4 భవనాలు పూర్తయ్యాయి. మరో 5 పనులు చివరి దశకు చేరాయి. 4 భవనాలకు స్థలం కొరత ఉండడంతో పనులు చేపట్టలేదు. మిగిలిన 5 భవనాల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వాసుదేవరావు, చర్ల ఏఈ, పంచాయతీరాజ్

త్వరలోనే స్థల సేకరణ



మండలంలోని తిప్పాపురం, కుర్నపల్లి, కొత్తపల్లి, బోదనెల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలకు అనుకూలమైన స్థలాలను పరిశీలిస్తున్నాం. స్థలాలు అనుకూలంగా లేకపోవడంతో ఆయా పంచాయతీల్లో వేర్వేరు ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాల కోసం అన్వేషిస్తున్నాం. వీలైనంత త్వరలోనే స్థలాలను పరిశీలించి నిర్మాణాలకు అప్పగిస్తాం.

– ఎం.శ్రీనివాస్, తహసీల్దార్, చర్ల